క్లుప్తంగా

కాణిపాకంలో భక్తుల సందడి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం బుధవారం భక్తుల సందడితో నిండిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు 11,497 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన భక్తులు రూ.1,83,068 నగదును విరాళంగా ఇచ్చుకున్నారు. దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.5.11 లక్షల ఆదాయం ఆలయ ఖాతాలోకి చేరిందని అధికారులు వెల్లడించారు.

ముగిసిన కారేటి గంగమ్మ కొలుపు



ప్రత్యేక అలంకరణలో కారేటి గంగమ్మ

కార్వేటినగరం: ఎగువరాజుల కండ్రిగలో కారేటి గంగమ్మ కొలుపు బుధవారం వైభవంగా ముగిసింది. మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాల అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మహిళలు పొంగళ్లు, పిండిదీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆ తర్వాత పొంగుపాలు తోడే కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో తనిఖీలు



మహిళలతో మాట్లాడుతున్న డీపీవో

గంగాధరనెల్లూరు: జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు బుధవారం మండలంలో క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పలు సమస్యలపై కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన పలు ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రంలో ఎగువూరు, నెల్లెపల్లి గ్రామంలో పర్యటించి ప్రజలు ఇచ్చిన రెవెన్యూ సమస్యలు, డ్రైనేజీ నిర్మాణంపై అక్రమ కట్టడాలపై తనిఖీ చేశారు. అలాగే నెల్లెపల్లిలో స్వయం సహాయక సంఘాలు, గ్రామస్తులకు ఐవీఆర్‌ఎస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యంయాదవ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమం పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

గంగవరం: పంటల సాగులో రసాయనిక ఎరువులు వాడకం పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం తమ్మిరెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు చేసిన ప్రతి రైతు పంటల బీమా చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఎకరాకు రూ.840 ప్రీమియం చెల్లించాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి రాయితీలతోపాటు పంటలు దెబ్బతిన్నప్పుడు పరిహారం అందుతుందని వివరించారు. అనంతరం పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్, ఏవో రభీబా, మండల ఉద్యాన అధికారి వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మలేరియా అధికారి వేణుగోపాల్

పలమనేరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెంది జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా ఆఫీసర్ వేణుగోపాల్ సూచించారు. ఆయన బుధవారం కొలమాసనపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ దోమకాటుతో మలేరియా, డెంగీ, చికున్‌గునియా తదితర జ్వరాలు ప్రబలుతాయన్నారు. రాత్రిళ్లు దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల ముందు, పరిసరాల్లో వర్షపు నీరు నిలవకుండా చూడాలన్నారు. మెడికల్ ఆఫీసర్ అనౌఖి, సబ్ యూనిట్ ఆఫీసర్ జయశంకర్ పాల్గొన్నారు.

తపాలా.. అప్‌డేట్ ఇలా..

సెల్‌ఫోన్లు, ల్యాండ్‌ఫోన్లు..టెలిగ్రామ్‌లు.. మెయిల్స్ ఫ్యాక్స్‌లకు మునుపు మనకు సమాచార సాధనం తపాలశాఖ మాత్రమే. ఎలాంటి విషయమైనా ఉత్తర ప్రత్యుత్తరాలతోనే సమాచార మార్పిడి జరిగేది. అప్పట్లో పోస్ట్‌మెన్ రాక కోసం ఆరుబయట వేచి చూసిన వారెందరో..!మనీఆర్డర్ పంపాలన్నా, ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం ఇవ్వాలన్నా తపాలాశాఖనే జరిగేవి. కానీ ప్రస్తుతం మారుతున్న కాలానుగుణంగా కొరియర్స్, పార్సిల్ సర్వీస్, ఆన్‌లైన్ బుకింగ్స్ రాకతో ఆ శాఖ ప్రభావం తగ్గింది. దానికి తోడు తపాలాశాఖలో పెద్దగా మార్పులు రాకపోవడంతో స్పీడ్‌ను అందిపుచ్చుకోలేక వెనుకబడి పోయింది. దీనికి తోడు పాత స్టాఫ్‌వేర్‌ను వాడేవారు. అయితే ఇప్పుడు తపాలశాఖ కూడా అప్డేట్ అవుతోంది.



చిత్తూరులోని ప్రధాన తపాలా కార్యాలయం

- ఎన్నో ఏళ్ల తరువాత తపాలాశాఖలో సంస్కరణలకు శ్రీకారం
- నూతన స్టాఫ్‌వేర్ 2.0తో మార్పులు
- దశలవారీగా అప్‌డేట్ అవుతున్న శాఖ సేవలు
- ఈ–మనీఆర్డర్ సేవలూ అందుబాటులోకి..

చిత్తూరు కార్పొరేషన్: ఏళ్ల తరబడి ఒకటే ధోరణిలో నిర్వహణలో ఉన్న తపాలాశాఖ కూడా కాలానుగుణంగా వచ్చిన మార్పులకు తగ్గట్టు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 2012 నుంచి ఇన్ఫోసిస్ సంస్థ రూపొందించిన ఇండియా పోస్టు ఐటీ మోడరేషన్ ప్రాజెక్టు సాఫ్ట్‌వేర్‌ను మొన్నటి వరకు వాడారు. ఇది పూర్తిస్థాయి ఆన్‌లైన్ కాకపోవడంతో వేగంగా సేవలు అందేవి కావు. డేటా ట్రాన్స్‌ఫర్ థర్డ్ పార్టీ ద్వారా జరుగుతుండేవి. దీనికి తోడు నిర్వహణ, రిపేర్లు, ఇతర పనుల కోసం ఆ సంస్థకు కోట్లాది రూపాయాలు చెల్లించాల్సి వచ్చేది. వీటిని గమనించి శాఖలో మార్పులు తీసుకురావాలని భావించిన అధికారులు రంగం సిద్ధం చేశారు.

నూతన స్టాఫ్‌వేర్ 2.0తో మార్పులు..

సొంతంగా అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ)–2.0 స్టాఫ్‌వేర్‌ను మైసూర్‌లో తయారు చేశారు. వాటిని పరిశీలించి దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టారు. ఈనెల 18 నుంచి 21 వరకు జిల్లాలోని 427 పోస్టాఫీసుల్లో వాటిని ఇన్‌స్టాల్ చేశారు. ఇది పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో పనిచేస్తోంది. శాఖ స్టాఫ్‌వేర్ కావడంతో నిర్వహణ, ఇతర ఖర్చులకు రూ.కోట్లు చెల్లించాల్సిన అవసరం ఉండదు. దీంతో పాటు ఏదైనా సమస్య వస్తే వాటిని సరిచేయడానికి థర్డ్ పార్టీ టెక్నీషియన్ కోసం వేచి చూసే పని ఉండదు. కొత్త విధానంతో వేగంగా వినియోగదారులకు సేవలు అందుతాయి.

దశల వారీగా అప్డేట్ అవుతున్న శాఖ..

మొదటగా తపాలశాఖ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ సేవలకు సంబంధించిన అప్‌డేట్‌తో అడుగువేసింది. అకౌంట్ ఓపెన్‌కు రూ.200, ఆన్‌లైన్ సేవలు, పోస్టల్ ఏటీఎంలు వంటి సేవలు తీసుకొచ్చారు. వీటితో పాటు యాక్సిడెంట్, లైఫ్, టర్మ్, వెహికల్ ఇన్సూరెన్స్‌లు కట్టే సౌలభ్యం అందుబాటులోకి తెచ్చారు. ఇప్పుడు ×డాక్ సేవ యాప్‌ ఀ పేరిట వినియోగదారులకు ఆన్‌లైన్ సేవలతో దగ్గరవ్వడానికి ప్రయత్నిస్తున్నారు. లెటర్ బుకింగ్ ఇతర సేవల కోసం తపాలా కార్యాలయాలకు వెళ్లి అక్కడ వాహనం పార్క్ చేసి, సేవలను వినియోగించుకుని తిరిగి వచ్చే వరకు సమయం పట్టేది. అలాకాకుండా ఇంటి వద్ద నుంచి యాప్ ద్వారా సేవలను బుక్ చేసుకుంటే పోస్ట్‌మ్యాన్ ఇంటికి వచ్చి లెటర్స్, పార్సిళ్లు, స్పీడ్‌పోస్టు తీసుకుని వెళ్తారు. కానీ అందుకు నిర్దేశిత రుసుం చెల్లించాలి. అదేవిధంగా ఆర్డినరీ లెటర్స్‌కు ట్రాకింగ్ సిస్టమ్ లేవు. లెటర్ పోస్టు చేశాక ఎక్కడ ఉందో, ఎప్పుడు వెళ్తుందో, చేరిందో లేదా అనే వివరాలు తెలియవు. ఇప్పుడు అలా కాకుండా రూ.5 అదనంగా చెల్లిస్తే ఆ లెటర్‌కు బార్‌కోడ్ ఇస్తారు. అప్పుడు వాటిని సులభంగా ట్రాకింగ్ చేసుకోవచ్చు. ఓటీపీ డెలివరీ విధానాన్ని తీసుకొచ్చారు. ఈ-మనీఆర్డర్ సేవలను పొందవచ్చు. సమస్యలపై యాప్‌లో ఫిర్యాదులు చేయవచ్చు. వినియోగదారుల సౌకర్యం కోసం శాఖలో మార్పులు తెస్తున్నట్లు ఆ శాఖ సీనియర్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ తెలిపారు.



డాక్‌సేవ యాప్‌లో సేవలు

అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ సౌకర్యం

సాక్షి ఎఫెక్ట్..

యాదమరి: మండలంలోని ఓటేరుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కారమైంది. బుధవారం 'చీకట్లో చిట్టి చదువులు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సంబంధిత ఐసీడీఎస్ అధికారులు ఓటేరుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ విద్యుత్ సౌకర్యం కల్పించారు. శాశ్వత భవనం కోసం నిలిచిన నిర్మాణ పనులను వెంటనే పనులు ప్రారంభించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని సీడీపీఓ వినుతశ్రీ చెప్పారు.

నిరాశ్రయులను చేయొద్దండి సార్..



ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మున్సిపల్ అధికారులు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల పేరిట ప్రజలను నిరాశ్రయులుగా చేయొద్దని పలువురు వాపోయారు. బుధవారం కట్టమంచి చెరువు పక్కన ఉన్న పలు ఆక్రమణలకు మున్సిపల్ అధికారులు తొలగించారు. దీనిపై బాధితులు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి తాము రెండు సెంట్ల భూమిలో ఇళ్లు కట్టుకుని ఉన్నామని, మున్సిపాలిటీకి ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నామన్నారు. నిజంగా అధికారులు రోడ్డు విస్తరణ చేసి, తమ ఇళ్లను అడిగితే ఇచ్చేస్తామన్నారు. కానీ తమ స్థలాన్ని సేకరించి సంపన్నులకు ఇస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో ఆక్రమణలు తొలగిస్తున్నామని తెలిపారు. సర్వం కోల్పోతున్న వాళ్లకు కలెక్టర్‌తో మాట్లాడి ప్రత్యామ్నాయం కల్పిస్తామన్నారు.

అధికారులు జవాబుదారీగా ఉండాలి

తవణంపల్లె: ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీగా ఉండాలని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం-2005పై మండలస్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలు పరిపాలనా విషయాలపై సమాచారం అడిగితే సకాలంలో ఇవ్వాలని సూచించారు. సమాచారం చట్టం ప్రకారం ఏ విషయమైనా 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. 30 రోజుల్లో సమాచారం ఇవ్వకపోతే అర్జీదారులు అప్పిలేట్ అధికారికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అప్పటికీ స్పందించకపోతే విజయవాడలో సమాచార హక్కు చట్టం కార్యాలయంలో అర్జీదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీనిపై సదరు అధికారులు కమిషన్‌కు దగ్గర హాజరు కావాల్సి వస్తోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశానికి వ్యవసాయాధికారి ప్రవీణ్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమాచారం హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి

అనుమానాస్పద మృతిపై విచారణ పూర్తి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బీఎస్‌ఆర్‌పేటలో జరిగిన అనుమానాస్పద మృతిపై పోలీసుల విచారణ బుధవారంతో పూర్తయింది. యాదమరి మండలం పత్రపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ (25) ఆదివారం ఉదయం చిత్తూరు మండలం బీఎస్‌ఆర్‌పేట చెరువు కట్టపై శవమై కనిపించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు.. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. మూడు రోజులుగా చేపట్టిన విచారణలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మృతుడు కరెంట్ షాక్‌తో మృతి చెందాడని, ఈ మృతికి తామే కారణమవుతారని.. భయపడి మృతదేహాన్ని చెరువు కట్టపై పడేసి వెళ్లిపోయినట్లు సమాచారం.

'మీ సేవలు మరువలేనివి'



వైద్యాధికారులతో బదిలీపై వెళ్తున్న వైద్యసిబ్బంది

యాదమరి: ప్రజల ఆరోగ్యం పట్ల మీరు తీసుకున్న శ్రద్ధ, విధుల పట్ల అంకిత భావం ఎన్నటికీ మరువలేమని మండల వైద్యాధికారి డా.అనిల్ కుమార్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని సంతగేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఆరోగ్య సిబ్బంది సన్మాన కార్యక్రమానికి జిల్లా మలేరియా అధికారి డా.వేణుగోపాల్‌తో కలిసి మండల వైద్యాధికారి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు బదిలీపై వెళ్తున్న వారిని ఉద్దేశించి మాట్లాడారు. వైద్యచికిత్స నిమిత్తం వచ్చే రోగుల పట్ల మీరు చూపిన ప్రేమ ఆప్యాయతలతో మండలంలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఇతర సిబ్బందికి విధుల విషయంలో తాము చూపించిన క్రమశిక్షణ ఆదర్శంగా నిలవడం అభినందనీయమన్నారు. బదిలీపై వెళ్తున్న ప్రాంతంలో రోగులకు విశేష సేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నామని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన మెడికల్ అధికారి సురేఖ, సీహెచ్‌ఓ లక్ష్మీ నారాయణ, ఎస్‌ఏ ప్రవీణ్‌రాజ్, ల్యాబ్ టెక్నీషియన్ విజయ్, ఆరుగురు ఏఎన్‌ఎంలకు, అలాగే సీహెచ్‌ఓగా పదోన్నతి సాధించిన శాంతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాస మూర్తి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న జాతీయ రహదారి





బండకిందపల్లె వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జిలో నిలిచిన వర్షపు నీరు, కమోళ్లపల్లె అండర్ పాస్ వద్ద బురదగా వున్న రోడ్డు

రొంపిచెర్ల: చిన్నపాటి వర్షానికే మండలంలోని బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారి దెబ్బతినింది. కమోళ్లపల్లె వద్ద ఏర్పాటు చేసిన అండర్ పాస్ రోడ్డులో నీరు నిలిచి నడిచేందుకు కూడా వీలు కావడంలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే బోనంవారిపల్లె–బండకిందపల్లె మధ్య రోడ్డు కోతకు గురైంది. బండకిందపల్లె వద్ద నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బాక్స్ టైప్ బ్రిడ్జిలో ఐదు అడుగుల లోతు నీరు నిలిచింది. ఈ క్రమంలో బండకిందపల్లెకు చెందిన విద్యార్థులు మట్లోళ్లపల్లె అండర్ పాస్ నుంచి రెండు కిలోమీటర్లు చుట్టి పాఠశాలకు చేరుకోవాల్సి వచ్చింది. బండకిందపల్లె వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేస్తేనే విద్యార్థులను బడికి పంపుతామని తల్లిదండ్రులు స్పష్టం చేయడంతో స్థానిక అధికారులు నేషనల్ హైవే ఇంజినీర్లతో చర్చలు జరిపారు. బండకిందపల్లె వద్ద నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సదుంలో తగ్గిన వేరుశనగ సాగు

సదుం: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. తొలకరిలో వర్షాలు ఆశలు రేకెత్తించినా అదునుకు పడలేదు. దీంతో పలువురు రైతులు ఎదురు చూసి నిరాశ చెందారు. మండలంలో సాధారణంగా ఖరీఫ్‌లో 809 హెక్టార్లలో వేరుశనగ సాగు వుంటుంది. ఈ ఏడాది 40 హెక్టార్లలో మాత్రమే రైతులు వేరుశనగ పంట వేశారు. గతం వారంలో రెండు వందల ఎకరాల వరకు విత్తనాలు సాగు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వేరుశనగ సాగుకు అనుకూలం కాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేయడంతో పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు. రాయితీ ధరతో ఉలవలు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు. కాగా ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 563 హెక్టార్లు కాగా.. ఇప్పటి వరకు 13 హెక్టార్లలో మాత్రమే సాగైంది.




సదుంలో సాగులో ఉన్న వేరుశనగ

అదును దాటుతోంది.. వేరుశనగ సాగెలా?

కూటమి ప్రభుత్వం రైతన్నలకు చేయూత ఇవ్వకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం రైతుల పంట సాగు కోసం పెట్టుబడి నిధి ఇస్తామని వాగ్దానం చేసి ఏడాది గడిచింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు రైతులకు పెట్టుబడి నిధి అందించలేదు. రైతులకు వేరుశనగకు సాగు అవసరమైన సబ్సిడీ విత్తనకాయలను ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. దీంతో అన్నదాతలు అప్పులు చేసి విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసి సాగుకు సిద్ధమయ్యారు.



టి.పుత్తూరులో ఓ రైతు వేరుశనగ సాగుకు సిద్ధం చేసి ఉంచిన పొలం



మిట్టపల్లె దగ్గర ట్రాక్టర్‌తో పొలంలో సేద్యం పనులు చేస్తున్న రైతు

- కూటమి ప్రభుత్వంలో రైతన్నకు కష్టాలు
- పంటల సాగుకు అన్నదాత సుఖీభవ అందించని పాలకులు
- సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు కూడా అందించలేక చేతులెత్తేసిన ప్రభుత్వం
- అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తెచ్చి పెట్టుకుంటే..
- ముఖం చాటేసిన వరుణుడు
- గతేడాది కంటే ఈసారి మరింత తగ్గిన వేరుశనగ సాగు విస్తీర్ణం
- అయోమయంలో అన్నదాతలు

తవణంపల్లె: వ్యవసాయానికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఖరీఫ్‌లో పంటల సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. మరోవైపు ప్రభుత్వం రైతన్నలకు కనీసం పూర్తిస్థాయిలో విత్తనకాయలు కూడా అందించలేకపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో అన్నదాతలు అప్పులు చేసి వేరుశనగ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొని పంట సాగుకు సిద్ధం కాగా.. తీరా వరుణుడు ముఖం చాటేశాడు. వర్షాలు పడకపోవడంతో పంట విత్తడానికి అదును దాటింది. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు విత్తనం విత్తినా దిగుబడి వస్తుందా ? అని రైతన్నలు సందిగ్ధంలో పడ్డారు. ఖరీఫ్‌లో రైతులు వర్షాధార పంటగా అధికంగా సాగు చేస్తారు. ఇప్పటికే విత్తనాలు విత్తి కలుపుతీసే దశలో ఉండాలి. కానీ రైతులపై ప్రభుత్వంతో పాటు ప్రకృతి కూడా సహకరించకపోవడంతో అదునులో విత్తనాలు వేయలేకపోయారు. ఖరీఫ్‌లో వేరుశనగతో పాటు పప్పు దినుసు పంటలు అంతర పంటలుగా సాగు చేస్తారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

అతి తక్కువ విస్తీర్ణంలో సాగు..

కూటమి ప్రభుత్వంలో రైతులు పెట్టుబడి పెట్టలేక ఖరీఫ్‌లో పంటల సాగుకు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వంలో సీఎంగా ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతు భరోసా నగదును రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఆర్‌బీకేల ద్వారా వేరుశనగ విత్తనకాయలు, ఎరువులు, పురుగు మందులు.. ఇలా ప్రతిదీ రైతులకు అండగా నిలిచారు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో రైతులకు సహకారం లేదు. మండలంలో 1,714 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేయాలనేది లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం 3 హెక్టార్లలో(10 ఎకరాలు) మాత్రమే వేరుశనగ సాగు చేశారు. గత సంవత్సరం కూడా 524 హెక్టార్లలో మాత్రమే పంట సాగైంది. రైతులకు ఈ ఏడాది విత్తనాలు కూడా అవసరమైన మేర సరఫరా చేయడంలో ప్రభుత్వం చేతులెత్తేసింది.

అన్నదాత సుఖీభవ ఎన్నటికో....!

కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో రైతులకు హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు తాము రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక వ్యవసాయాన్ని విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు పెట్టుబడి నిధి(అన్నదాత సుఖీభవ) ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో కనీసం ఎరువులు, క్రిమి సంహారక మందులు సైతం సరఫరా చేయడంలేదని వ్యక్త పరిచారు.

పంట సాగు తగ్గింది



వేరుశనగ పంట సాగుకు పెట్టుబడి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వర్షాలు అదునుకు కురవకపోవడంతో రైతులు దుక్కులు దున్నినా లాభం లేకపోయింది. అదునుకు వర్షాలు పడి విత్తనాలు విత్తితేనే దిగుబడి సాధ్యం.

–పరదేశి, రైతు, చెర్లోపల్లె

పెట్టుబడి లేక సాగు చేయలేకున్నాం



ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేయడానికి పెట్టుబడి లేక ఇబ్బందులు పడుతున్నాం. అప్పు చేసి శనగకాయలు తెచ్చినా అదునుకు వర్షాలు పడలేదు. విత్తనాలు విత్తకుండా కొంతమంది ఆపినారు. ఇప్పుడు విత్తనాలు విత్తాలా ? వద్దా అని సందిగ్ధంలో ఉన్నా. పంటల సాగు భారంగా మారింది.

–అనిత, రైతు, దిగువమోదలపల్లె

అన్నదాత సుఖీభవ ఎప్పుడిస్తారో ?



రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింది ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసింది. కానీ చివరకు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతు నెత్తిన పెనుభారం మోపింది. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

–రామచంద్రారెడ్డి, రైతు, ఎగువ తవణంపల్లె

వ్యాధుల కాలం..
పశు సంరక్షణ అవసరం..

గుడిపాల మండలంలోని చిత్తపార గ్రామంలోని పాడి రైతు కృష్ణ మందడికి మూడు పాడిఆవులు ఉన్నాయి. ఇటీవల ఓ ఆవుకు ముద్ద చర్మవ్యాధి లక్షణాలు కనిపించాయి. పాల దిగుబడి తగ్గడంతో పాటు ఆవు అనారోగ్యానికి గురవడంతో రైతు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

గుడిపాల మండలం గొల్లమడుగు గ్రామంలోని పాడి రైతు రవీంద్రారెడ్డి రెండు పాడిఆవులు ఉన్నాయి. ఒక ఆవుకు ముద్దచర్మ వ్యాధి లక్షణాలు కనిపించడంతో రైతు వెంటనే పశువైద్యున్ని సంప్రదించాడు. ఆయన వెంటనే టీకాలు వేయడంతో ప్రస్తుతం కొంత మేర పాడి ఆవు కోలుకుంది.


ముద్దచర్మ వ్యాధి బారిన పడిన పాడి ఆవు

పశువులకు ముద్దచర్మ వ్యాధి ముప్పు..
- దూడలపై మరింత ప్రభావం
- టీకా వేయించకపోతే ప్రాణాపాయం
- పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యాధికారులు

- సెప్టెంబర్ – జనవరి నెలల మధ్యలోనే పశువులకు వ్యాధుల వ్యాప్తి
- లంపీస్కిన్‌తో రైతులు జాగ్రత్తగా ఉండాలి
- పాడి పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

గుడిపాల: పశువులకు ముద్దచర్మ వ్యాధి వ్యాప్తిస్తుండడంతో పాడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఏటా జూలై–సెప్టెంబర్ నెలల మధ్య మాత్రమే వ్యాపించే ఈ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని గుడిపాల, బొమ్మసముద్రం పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ సూచిస్తున్నారు. తెల్లపశువులు అయిన ఆవులు, ఎద్దుల్లో ఎక్కువగా కనిపించే ఈ వ్యాధి తీవ్రత బర్రెల్లో కాస్త తక్కువగా ఉంటుంది. లంపీస్కిన్ అనే వైరస్ వల్ల కలిగే ఈ వ్యాధి పశువుల రక్తం పీల్చే దోమలు, ఈగలు, పిడుదుల ద్వారా ఒక పశువు నుంచి మరో పశువుకు సులభంగా వ్యాపిస్తుంది. అది కూడా అక్టోబర్ నుంచి జనవరి నెల మధ్యనే ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి నివారణకు పశువైద్యశాఖ సిబ్బంది సెప్టెంబర్‌లోనే వ్యాధి నిరోధక టీకాలను అందించే కార్యక్రమం చేపట్టారు. పశు సంవర్ధక శాఖ అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఈ వ్యాధి ముందుగా దూడలకు వ్యాపించి, వృద్ధి చెందుతుంది. వ్యాధి తీవ్రత ఉండే నాలుగు నెలల పాటు పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు..

ముద్దచర్మ వ్యాధి బారిన పడిన పశువుల్లో 104 డిగ్రీల నుంచి 106 డిగ్రీల జ్వరం ఉంటుంది. చర్మంపై బొబ్బలు, బుడిపెలు, పొక్కులు ఏర్పడతాయి. నెమ్మదిగా అవి పగిలి పుండ్లుగా మారుతాయి. బుడిపెలు ఎక్కువగా తల, మెడ, పుదుగుతో పాటు చర్మం పలుచగా ఉండే ఇతర ప్రాంతాల్లో వస్తాయి. మేత సరిగ్గా తినకపోవడం.. నోరు, ముక్కు నుంచి


ముద్దచర్మ వ్యాధి బారిన పడిన దూడ

చొంగకారడం, పాల దిగుబడి తగ్గిపోవడం, అలసటగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని పశువైద్యున్ని సంప్రదించాలి. నివారణకు సులభంగా జీర్ణమయ్యే గంజి లాంటి ఆహార పదార్థాలతో కొద్దిగా ఉప్పు కలిపి పశువులకు తాగించాలి. జ్వరం తీవ్రత తగ్గేవరకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని క్రమం తప్పకుండా తాగించాలి. జ్వరం తగ్గడానికి మెలోక్సికామ్, అనాల్జిన్ మందులను వైద్యుల సూచన మేరకు వాడాలి. సెకెండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లయితే యాంటీ బయాటిక్, న్యూమోనియా లక్షణాలు ఉన్నట్లయితే అవిల్, సీపీఎం వంటి మందులను వాడాలి.

ప్రత్యేక దృష్టి సారించాలి..



వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. పశువుల పాకలో దోమల బెడద లేకుండా ఉండడానికి దోమతెరలు లేదా వేపాకు పొగా వేయాలి. వ్యాధి నివారణకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో జీవాలకు టీకాలు వేస్తున్నాం. అయినా ముద్దచర్మ వ్యాధి సోకితే పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలి. –సాయిసుధ, మండల పశువైద్యాధికారి

ఘనంగా నరసింహ స్వామి ఆలయ కుంభాభిషేకం


శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వేదపడింతులు

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం మహాకుంభాభిషేకాన్ని ఘనంగా చేపట్టారు. ముందుగా ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. హోమం నిర్వహించి మహాపూర్ణాహుతి అనంతరం స్వామి వారికి తిరుమంజనం పెట్టారు. ఈ నెల 25 వరకు మహాకుంభాభిషేకం చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

పుంగనూరు: పట్టణంలోని వినియోగదారులకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టకుండా నిలుపుదల చేయాలని సీపీఐ నాయకులు వెంకటరమణారెడ్డి, రామమూర్తి, మున్నా డిమాండ్ చేశారు. వారు బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలను పెంచుతూ సామాన్యులపై అధిక భారం మోపుతోందని తెలిపారు. ప్రతిపక్షంలో వున్నప్పుడు స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండి అని నారా లోకేష్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు ఎలా బిగిస్తారని నిలదీశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో ప్రజల నుంచి రూ.1500 కోట్లను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ డబ్బులు ఎవరికి వెళుతున్నాయని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు వెంకటరమణారెడ్డి, రామమూర్తి, మున్నా

విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులు ఎంతో ఉపయోగం

పుంగనూరు: విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు బ్రిడ్జి కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో బుధవారం మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల్లో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు అనీల్‌కుమార్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.